క్లుప్తంగా

సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

కడియం: జేగురుపాడు గ్రామపంచాయతీ పరిధి జగనన్న కాలనీ వద్ద నిర్మిస్తున్న ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులను వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం పరిశీలించారు. కాలనీలో ఇప్పటికే 500 మందికి పైగా గృహాలను నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా లైన్లు సక్రమంగా లేకపోవడంతో తరచూ సరఫరా నిలిచిపోయి, ఇబ్బందులు ఎదురవడంతో ఆ విషయాన్ని గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి మూడు కోట్ల రూపాయల అంచనాలతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించిన చందన్‌కు స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీర శివాజీ, బళ్ల అన్నవరం, శాఖ కిరణ్ కుమార్, పుట్టా బుజ్జి పాల్గొన్నారు.

రమాదేవికి ఘన సత్కారం

ప్రకాశం నగర్: తెలుగు ఉపన్యాసకురాలు వి.రమాదేవిని తమిళనాడులోని హోసూరులోని ఆంధ్ర సంస్కృతి భవనంలో శనివారం ఘనంగా సత్కరించారు. 82 పైచిలుకు రచనాలు చేసిన కోట జయలక్ష్మి రచనలపై పద్య రచన చేసినందుకు గాను ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కోఆర్డినేటర్ ఈవీఎల్ నాయుడు, డైరెక్టర్లు సుగుణారెడ్డి, గంగిరెడ్డి తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి రెప్కో 400 నూతన పథకం ప్రారంభం

ప్రకాశం నగర్: రెప్కో 400 నూతన డిపాజిట్ పథకాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.పవన్‌చంద్ర శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 400 రోజులకు సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ, ఇతరలకు 7.75 శాతం వడ్డీ ఇస్తారన్నారు. ఈ వడ్డీ ఒక నెల, మూడు, ఆరు నెలల ఒక్కసారి తీసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా 18 నెలల కాలపరిమితి డిపాజిట్లపై 7.65 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక టి.నగర్‌లోని బ్రాంచీ కార్యాలయాన్ని ఖాతాదారులు సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన


వస్త్ర ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్‌లో ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతా కాంత్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి పొందిన సుమారు 50కు పైగా డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చి ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేసినట్టు తెలిపారు. ప్రదర్శన 17వ తేదీ రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

కడియం: కడియం మండల పరిషత్ సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేగురుపాడు సర్పంచ్, కడియం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ మాట్లాడుతూ నర్సరీ అసోసియేషన్ వసూలు చేస్తున్న సెస్సులో గ్రామ పంచాయతీలకు కూడా వాటాను కేటాయించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. నర్సరీ అసోసియేషన్ అనధికారికంగా వసూలు చేస్తున్న సెస్సులో గ్రామానికి రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తే ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆస్కారం ఉంటుందన్నారు. అసోసియేషన్ ముందుకు రాకపోతే తాను కోర్టు ద్వారా అనధికారిక వసూళ్లపై అభ్యంతరం తెలిపేందుకు అవకాశం ఉందన్నారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ ఒక కమిటీ వేసి చర్చలు జరుపుదామన్నారు. అయితే దీనిపై దామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్, జనసేన కడియం మండల పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జెమి అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసోసియేషన్‌పై పంచాయతీల పెత్తనం తగదన్నారు. అసోసియేషన్ ప్రమాణ స్వీకారం తరువాత చర్చలు జరుపుదామనడంతో వాగ్వాదం సద్దుమణిగింది. వివిధ గ్రామాల సమస్యలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

సీటీఆర్ఐ: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో నిత్యం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులు కంటిపూడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి 11వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆయన కోరారు.

తలుపు తట్టి.. నాడిపట్టి..


ఇంటి వద్దే వైద్యం చేస్తున్న డాక్టర్ నాగదేవి


బాలింతకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నాగదేవి

- విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్
- ఇంటి వద్దకే వచ్చి సేలందిస్తున్న వైద్యులు
- 104 వాహనాల్లో 14 రకాల పరీక్షలు
- అందుబాటులో 67 రకాల మందులు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: వ్యాధుల బారిన పడితే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందనే బెంగ పోయింది. నాణ్యమైన వైద్యం ఇంటి తలుపు తడుతోంది. ఎలాంటి అత్యవసర పరిస్థితిల్లోనైనా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఒరవడికి నాంది పలుకుతున్నారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేశారు. ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే సకాలంలో చికిత్స ద్వారా కోలుకునే అవకాశం ఉంటుందని గ్రహించి ఆ మేరకు చర్యలు చేపట్టడం విశేషం.

ఖాళీ పోస్టుల భర్తీ

రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ విషయంలో జగన్ రాజీలేని నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే కార్పొరేట్ వైద్యం ప్రతి ఒక్కరికి చేరువవుతోంది. దాదాపు 4 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్యసేవలు పొందే అవకాశం కల్పించడం విశేషం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రిల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పనకు నడుం బిగించారు. ఏళ్ల తరబడి ఖాళీ ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఇద్దరు వైద్యులు ఉండగా, మరో ముగ్గురిని నియమించారు. గత ఏడాది అక్టోబరు 21న ఇంటి వద్దకే వైద్యం నినాదంతో ఫ్యామిలీ డాక్టర్‌కు శ్రీకారం చుట్టారు.

మండలంలో వైద్యసేవలు భేష్

ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి ఆధ్వర్యంలో నలుగురు వైద్యులు రాజమహేంద్రవరం రూరల్ మండలంలో సేవలందిస్తున్నారు. మండలంలో రెండు 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందులో 14 రక్త పరీక్షలతో పాటు వివిధ ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలను డేటా ఎఫ్‌పీసీయాప్‌లో పొందుపరుస్తారు. ఇలా నెలకు రెండు సార్లు ఇంటి వద్దకే వైద్యం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా అంగనవాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.

67 రకాల మందులు

కొత్త వైద్య విధానంలో భాగంగా ఇంటి వద్దకే పరీక్షలు నిర్వహిస్తున్నారు. 104 వాహనంలో మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఆరోగ్యపరిస్థితి ఆధారంగా వైద్యులు సూచనలు మేరకు రక్తపరీక్షలు చేపడతారు. అలాగే అనారోగ్య సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 67 రకాల మందులు సిద్ధం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ప్రభుత్వం శస్త్రచికిత్సల అనంతరం బాధితుడి పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో.. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రారంభించినప్పటి నుంచి గణాంకాలు

విలేజ్ హెల్త్ క్లినిక్స్	33
కొత్తగా పీహెచ్‌సీ	1 కాతేరు
104 వాహనాలు	2
ప్రజలకు చేసిన వైద్య పరీక్షల వివరాలు	
గ్రామ సచివాలయాల సందర్శనలో చేసిన వైద్య పరీక్షలు :	46,053
జనరల్ ఓపీ :	22,409
గర్భిణులు :	2167
బాలింతలు :	1295
రక్తహీనత :	124
బీపీ :	7872
షుగర్ :	6781
నోటి క్యాన్సర్ :	54
గర్భసంచిక్యాన్సర్ :	24
సర్వైకల్ క్యాన్సర్ :	67
టీబీ :	39
బోధ :	31

ఆరోగ్యసేవలు అభినందనీయం



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం. నెలకు రెండు సార్లు 104 వాహనం వచ్చి వైద్యులు పరీక్షలు నిర్వహించి బీపీ, షుగరుకు ఉచితంగా మందులు ఇస్తున్నారు. రూపాయి ఖర్చు లేకుండా అన్ని మందులను అందజేస్తున్నారు.

– కొట్టి కుమారి, శాటిలైట్‌సిటి

పకడ్బందీగా అమలు



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పకడ్బందీగా అమలవుతోంది. నెలలో 54 గ్రామ సచివాలయాలను 104 వాహనం సందర్శించి వైద్యులు సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పల్లెకు వైద్యాన్ని తీసుకొచ్చింది. డాక్టర్లు రోగుల ఇంటి వద్దకే వెళ్లి సేవలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైంది.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, ధవళేశ్వరం పీహెచ్‌సీ

సర్వం కోల్పోయిన వారికి అండగా..

వలంటీర్లకు వందనం


బొడ్డు కృపమ్మకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను అందజేస్తున్న వలంటీర్ బోనుసాయి లహరిక

గత ఏడాది జూలై 14వ తేదీన అగ్ని ప్రమాదంలో హుకుంపేట డీబ్లాకు గౌతమీనగర్‌కు చెందిన బొడ్డు కృపమ్మ ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు కుమారులతో కృపమ్మ కట్టుబట్టలతో రోడ్డుపై పడింది. అగ్నిప్రమాదంలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లు సర్వం బూడిదయ్యాయి. ఆ సమయంలో కృపమ్మకు వలంటీర్ బోను సాయిలహరిక అండగా నిలిచింది. వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, ఎంబీసీ చైర్మన్ పెంద్రవీరన్న, బాధ్యత సేవా సంస్థలతో పాటు, తహసీల్దార్ కార్యాలయం నుంచి కృపమ్మకు సహాయం అందించడంలో వలంటీర్ లహరిక ముఖ్య భూమిక పోషించింది. అంతేకాకుండా బూడిదైన ఆధార్‌కార్డుతో పాటు రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లను సైతం అన్ని దరఖాస్తులను తానే స్వయంగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి ఆమెకు అందించింది.

– రాజమహేంద్రవరం రూరల్

ఆమె సేవలు మరువలేను



ఇల్లు కాలిపోయినప్పటి నుంచి వలంటీర్ లహరిక తనకు అండగా నిలిచింది. తమ కుటుంబం మళ్లీ నిలదొక్కుకునేలా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకుపాస్‌బుక్‌లు వచ్చేలా చేసింది. ఇంటిలో కుటుంబ సభ్యురాలిగా తమతో కలిసి మెలిసి ఉంటుంది. వలంటీర్ చేసిన సేవలు మరువలేనివి.

– బొడ్డు కృపమ్మ, డీబ్లాక్, హుకుంపేట

ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ భరత్


ఆలయ పాలక వర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్

సీటీఆర్ఐ: గోదావరి గట్టుపై కొలువైన మార్కండేయేశ్వరస్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం ఆయనతోపాటు అర్బన్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అడపా శ్రీహరి సమక్షంలో ఆలయ కమిటీ కొలువుదీరింది. తొలుత ఆలయానికి చేరుకున్న ఎంపీ భరత్‌ను ఆలయ మర్యాదలతో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ మూల విరాట్ మార్కండేయేశ్వర స్వామి, పార్వతీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం వేదాశీస్సులు అందజేశారు. అనంతరం నూతన పాలకవర్గం చేత ఎంపీ భరత్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకమండలి చైర్మన్‌గా యిన్నమూరి ప్రదీప్(దీపు) పేరును యజ్ఞవరపు శ్రీనివాసరావు ప్రతిపాదించగా, దాసరి శివప్రసాద్ బలపరిచారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాలకమండలి అభినందన సభలో ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పదేళ్ల తరువాత ఆలయానికి పాలక మండలి ఏర్పడిందన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకమండలిపై ఉందని, ఈ అభివృద్ధిలో తన వంతు సాయం అందిస్తామన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి చేస్తా

ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని, స్వామివారికి సేవ చేస్తే భాగ్యం రావడం నా పూర్వజన్మ సుకృతమని పాలకమండలి చైర్మన్ యిన్నమూరి ప్రదీప్ ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని, రూ.1.2 కోట్ల అంచనాతో ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. రూ.7లక్షలతో ధ్వజ స్తంభం, రూ.17 లక్షలతో ఆలయ గోపురం, రూ.17 లక్షలతో ఆలయానికి రంగులు, రూ.70 కేజీల వెండితో గుమ్మాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీఎంఆర్ రూ.15 లక్షలు అందించడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రాగోలు శ్రీను, గూడూరి రాధిక, పాలిక శ్రీను, గుర్రం గౌతమ్, పిల్లి నిర్మల, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, అన్నపూర్ణ రాజు, వాకచర్ల కృష్ణ, కాలే చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే సీఎం లక్ష్యం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- లబ్ధిదారులకు ఆర్థిక సాయం మంజూరు పత్రాల అందజేత


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పేదల సొంతింటి కల సాకారం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం స్థానిక శ్రీవేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం ' కింద సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆర్థిక సహాయ మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. 223 మంది లబ్ధిదారులకు ఈ పత్రాలను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో లబ్ధిదారునికి రూ.1.80 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నాయన్నారు. అలాగే లబ్ధిదారులకు సబ్సిడీపై గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుక, ఐరన్, సిమెంట్ తదితర మెటీరియల్‌ను అందజేస్తున్నారు. రాష్ట్రంలో 32 లక్షల మంది పేదలకు సొంతిల్లు కట్టించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, ఇది దేశ చరిత్రలోనే రికార్డుఅని అన్నారు. ప్రస్తుతం మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని, దశల వారీగా వారికి ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందని ఎంపీ భరత్ తెలిపారు. ఆయా వార్డు ఇన్‌చార్జులు దగ్గరుండి లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి.పరశురామ్, హౌసింగ్ డీఈఈ కే సూరిబాబు, హౌసింగ్ ఏఈ కే ఉమాశంకర్, అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, మార్గాని సురేష్, మింది నాగేంద్ర, పిల్లి నిర్మల, అన్నపూర్ణ రాజు, బర్రే కొండబాబు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, దుంగా లక్ష్మీ, హసీనా బేగమ్, బ్యుల్డర్ చిన్న, లంకా ప్రసాద్, మేడబోయిన సునీల్ కుమార్, గుత్తుల భాస్కర్, బళ్ళా శ్రీనివాస్, తిరగాటి దుర్గ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు ఇన్చార్జులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ మేనేజర్ కేశవరావు


ద్వారకానగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కేశవరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ మేనేజర్ సీహెచ్ కేశవరావు అన్నారు. శనివారం మోరంపూడిలోని ద్వారకానగర్ పార్కులో స్వచ్ఛత-పక్వాడా -2023లో భాగంగా ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కేశవరావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ స్వచ్ఛత పక్వాడలో భాగంగా నగరంలో క్లీన్ అండ్ గ్రీన్ కింద పలు సామాజిక చైతన్య వంతమైన కార్యక్రమాలను చేపట్టామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే పుష్కర్ ఘాట్, మార్కండేయ ఘాట్ వద్ద నది జలాల నుంచి ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించామన్నారు. నగరపాలక సంస్థతో కలిసి నగరంలో మూడు పార్కులు అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు మొక్కలు నాటుతున్నామని చెప్పారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అపార్టుమెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివ కనక ప్రసాద్, ఓఎన్‌జిసి హెచ్‌ఆర్ జీఎం రావ్ నవీద్, దయంగ్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సుశీల, ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష ఆదరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందన నాగేశ్వర్ మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు సహాయం చేయడానికి ప్రతి గడపకూ చేరుకోవడం ద్వారా పాలనలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోందన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించడానికి ప్రభుత్వం ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సర్వేను నిర్వహిస్తోందన్నారు. ఇప్పటి వరకూ ఈ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి గృహాలు పూర్తి చేశామని, ఫలితంగా నలభై లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారన్నారు. ధ్రువీకరణ పత్రాలను పంపిణీకి, పౌరుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి సురక్ష ఒక వేదికగా పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,000 శిబిరాలను నిర్వహించాలనే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 7,915 క్యాంపులను విజయవంతంగా నిర్వహించడంతో ప్రభుత్వం గణనీయమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. పథకాలు లేదా సర్టిఫికెట్లకు సంబంధించిన ఏవైనా సమస్యుంటే 1902 ప్రత్యేక హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, జేసీఎస్ కన్వీనర్లు తాడాల చక్రవర్తి, తాటికొండ విష్ణు, రాజమౌళి, ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, జిల్లా వైఎస్సార్ టీయూసీ, దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, ఆర్యాపురం డైరెక్టర్ బిల్డర్ చిన్న, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు పెయ్యల రాజేష్, ఊటుకూరి శైలజ, అంగాడ సత్యప్రియ, పడమటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగన్ పెద్దపీట

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చందన్ నాగేశ్వర్‌తో కలిసి కడియపులంకలో పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన


స్థల దాత సీతామహాలక్ష్మి, కుటుంబ సభ్యులను అభినందిస్తున్న జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు తదితరులు

కడియం: ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కడియపులంకలో రూ.2.17 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందువరుసలో ఉందని, వైద్య రంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇవ్వడం వలనే అది సాధ్యమైందని జక్కంపూడి రాజా పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన 26 జిల్లాల్లో మెడికల్ కాలేజీలతో పాటుగా ఆసుపత్రులను నిర్మించేలా చర్యలు చేపడుతున్నారని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఒక ఏరియా ఆసుపత్రి, ప్రతి నియోజకవర్గంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రతి మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ద్వారా 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారన్నారు. కడియం మండల ప్రజల జనాభా ప్రాతిపదికన ప్రకారం మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలని భావించి నూతనంగా ప్రస్తుత ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు.

స్థల దాతకు ఘన సత్కారం

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన అన్నందేవుల సీతా మహాలక్ష్మికి ప్రముఖుల చేతుల మీదగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూరల్ కో-ఆర్డినేటర్ చందనా నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య కేంద్రానికి ఎంతో పెద్ద మనసుతో అన్నందేవుల సీతారామలక్ష్మి సుమారు రూ.5 కోట్ల విలువ గల స్థలాన్ని అందజేశారన్నారు. ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, డీసీసీబీబి బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, డాక్టర్ అనుసూరి పద్మలత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, మండల యూత్ కన్వీనర్ కొత్తపల్లి మూర్తి, ఐఎస్ఏమాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు ఆరేటి వెంకట్రావు, ఊటుకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక క్వారీ ప్రాంతంలో ట్రాక్టర్ ఢీకొని నల్లమాటి ఇమ్మానుయేలు రాజు(22) శనివారం మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపల్ కాలనీలో ఉన్న అంజనీ ఆసుపత్రిలో రంగంపేట సమీపంలోని చంద్రీడు గ్రామానికి చెందిన శ్యాంప్రసాద్ పని చేస్తున్నాడు. అతని కుమారుడు ఇమ్మానుయేలుతో కలిసి ఆసుపత్రి వద్దకు వస్తుండగా సరిగ్గా క్వారీ ప్రాంతానికి వచ్చే సరికి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఇమ్మానుయేలు రాజు కాలు పూర్తిగా నలిగిపోయింది. అతనిని వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 కేజీలు గంజాయి పట్టివేత

కంబాలచెరువు: స్థానిక గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి 25 కేజీల గంజాయిని మూడో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురు పాత నేరస్తులను పట్టుకున్నారు. నగరానికి చెందిన ఇ.శివకుమార్. మాటూరి వీరబాబు, దుర్గాసాయి, రేగుళ్ల వినోద్, కొడాలి నానిలను పట్టుకున్నారు. వీరి వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలుకి తరలించారు.

22, 23 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి తరగతులు

కంబాలచెరువు: కడపలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి తరగతులు, జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు తెలిపారు. ఈ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక కళాశాల ఆర్ట్స్ కళాశాల వద్ద యూ.గనిరాజు ఆవిష్కరించారు. అనంతరం గనిరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందని, ఫెల్లోషిప్‌లకు కోత విధించిందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం- 2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయికరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, జిల్లా కోశాధికారి కె.భానుప్రసాద్, మావో, కె.ధర్నేష్, వి.దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.